రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడలకు గిరిజన విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-సీతంపేట : పార్వతీపురం మన్యం జిల్లాలో సాప్ ఆధ్వర్యంలో నిర్వహించు రాష్ట్ర క్రీడలకు జిల్లాస్థాయి అర్చరీ లో ఎంపికైన హిమరిక లక్షిత ఏపి ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల కు చెందిన సీతంపేట విద్యార్థిని, ఈ విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఐటీడీఏ ఏపీవో చినబాబు, డిడి అన్నదొరై, సీతంపేట, స్పోర్ట్స్ అధికారి జాకబ్ దయానంద్, సీతంపేట, జిల్లా కోఆర్డినేటర్ ఎం.వాసుదేవనాయుడు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థిని తండ్రి ఇమరక ప్రసాద్ అభినందించారు.

డీఎస్సీలో మూడు ఉద్యోగాలతో దుర్గాప్రసాద్ హవా..!

- జిల్లాలోని డీఎస్సీలో మొదటి స్థానం - మూడు ఫార్మాట్లలో ఉద్యోగం కైవసం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస: మండలంలో గల చినమేరంగి గ్రామానికి చెందిన తుమరాడ దుర్గాప్రసాదరావు డిఎస్సీలో జిల్లాలోని ప్రథమ స్థానం సంపాదించి తన సత్తాను చాటుకున్నాడు. అంతేకాకుండా ఒకేసారి మూడు టీచర్ పోస్టులకు అర్హత సాధించి శభాష్ అనిపించుకున్నాడు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ (ఎస్.ఏ)లో 89.62 మార్కులు సాధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పిజిటి)లో 84.5 కోర్స్ సాధించిగా ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టిజిటి)లో 77.67 స్కోరు సాధించి తన సత్తా చాటి మూడింటిలో ఉద్యోగం సంపాదించి అందరి మన్ననలు పొందాడు. కాగా ఇవన్నీ తెలుగు పండిట్ విభాగంలోనే సాధించాడు. దీంతో తండ్రి తుమరాడ వెంకటరమణ, తల్లి పద్మావతి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈయన ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చినమేరంగిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ డిగ్రీ ఐదేళ్ల ఓరియంటల్ లాంగ్వేజ్‌ను పూర్తిచేసిన ఆయన బీఈడీని రాజమండ్రి ప్రభుత్వ కాలేజీలో పూర్తి చేశాడు. ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నంలో ఎంఏ (తెలుగు) పూర్తి చేసి డిఎస్సీలో తన సత్తా చాటాడు.

రాహుల్‌గాంధీ అరెస్టు అప్రజాస్వామికం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : భారతదేశ ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, విపక్ష ఎంపీలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గం ఇంచార్జ్ బత్తిన మోహన్‌రావు అన్నారు. మంగళవారం ఆ పార్టీ ఓబిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో అతి విలువైన ఓటు చోరీకి గురైందని నిరసిస్తూ ఢిల్లీలో ఈసీ కార్యాలయానికి వెళుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురిని అరెస్టు చేయటం అప్రజాస్వామ్యం అన్నారు. ఆయా అరెస్టులను తాము ఖండిస్తున్నామన్నారు. రాహుల్‌గాంధీ అరెస్టుతో ఓటు చోరీ జరిగిందని ప్రజలందరికీ తెలిసిందన్నారు. తమ అధినేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటం రాజకీయ పోరాటం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి లభించిన ఓటు హక్కును కాపాడే పోరాటం అన్నారు. భారత పౌరుడు స్వేచ్ఛగా వేసే ఓటు చోరీ అవుతుంటే ప్రశ్నించే నాయకుడిని, ప్రజల పక్షాన నిలబడే నాయకుని గొంతు నొక్కడం, శాంతియుత పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీని, విపక్ష నాయకుల్ని అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు చోరీకి గురి అయిందని ఓటు చోర్‌పై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటం ప్రశంసనీయమన్నారు. దేశ ప్రజలు జరిగిన మోసాన్ని గమనిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఓటు చోర్ పోరులో దేశం రాహుల్‌గాంధీ వెంట నడుస్తుందని అరెస్టులకు భయపడే నాయకుడు కాదని రాహుల్‌గాంధీ మద్దతుగా దేశ పౌరులు నిలబడుతున్నారన్నారు.

ఏటీఎం చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

విశాలాంధ్ర-పాచిపెంట : ఈనెల శనివారం రాత్రి 11 గంటల సమయంలో పాచిపెంటలో గల బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం చోరీ కేసులో పాచి పెంట కు చెందిన ఎజ్జల గౌరీష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్ సురేష్ విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఈనెల 9న 11 గంటల సమయంలో ఏటీఎంను పగలగొట్టి అమర్చబడిన సీసీ కెమెరాలు దొంగలించారనే కారణంతో బ్యాంకు జాయింట్ మేనేజర్ ఎల్ దేవి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడు వద్ద గల పరికరాలతో పాటు సీసీ కెమెరాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 10 క్రీడాంశాలలో ఎంపిక పోటీలను నిర్వహించడం జరిగిందని జిల్లా క్రీడా ప్రాధికారిత అధికారి కె.శ్రీధరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్ బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మొదలైన క్రీడాంశంలో క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ క్రీడా ఎంపికలో సుమారు 240 మంది క్రీడాకారులు (బాలురు 180, బాలికలు 60 మంది) పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులను జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాప్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగే జోనల్ స్థాయి క్రీడా పోటీలకు పంపడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా సంస్థ శిక్షకులు, ఎస్.జి.ఎఫ్. సెక్రటరీ మురళీ కృష్ణ, పిఈటిలు, పిడి లు, సహాయ అధ్యక్షులు యం. వాసుదేవరావు నాయుడు, ఐటిడిఏ సీతంపేట క్రీడాధికారి జాకబ్, ఎస్.జి.ఎఫ్. ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళీధరం,బి. వైకుంఠరావు, ఎస్. మురళీ, సీనియర్ క్రీడాకారులు, 10 క్రీడాంశాల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తామరకండి సహకార సంఘ అధ్యక్షునిగా శ్రీరాములునాయుడు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని తామరకండి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా యామల శ్రీరాములు నాయుడు, డైరెక్టర్లుగా నడిమింటి ధనంజయ, బక్కుజోగినాయుడులు నియమించబడ్డారు. తమను నామినేట్ చేసినందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే విజయ్ చంద్రకు, మండల, గ్రామటిడిపి నాయకులకు వారుధన్యవాదాలు తెలియజేశారు. కొత్తగా నియమించబడిన వారిని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర తన క్యాంపు కార్యాలయం వద్ద సత్కరించారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి నాయకులతోపాటు ఆసొసైటీ పరిధిలోగల వివిధ గ్రామాల టిడిపినాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం పోరు సాగించాలి

- ప్రభుత్వ బిసి, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి
- ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు
- ఘనంగా ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర-బెలగాం : అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్వతీపురం పట్టణంలో పలు కళాశాలలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు విచ్చేసి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం మా జన్మ హక్కని ఈ దేశాన్ని పాలిస్తున్నటువంటి బ్రిటిష్ తెల్ల దొరలను తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం ఎఐఎస్ఎఫ్ అని కొనియాడారు. ఆగస్టు 12 ది1936 ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాటం నిర్వహించి నేటికి 90 సంవత్సరాలు కావస్తుందని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థి నాయకులు రాజకీయ పార్టీలకు అనుమతి లేదని తీసుకువచ్చిన జీవోలు ఎవరికోసం ఎవరి లబ్ధి కోసమని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని కోరారు. దేశంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యను కాషాయకరణ చేయడానికి ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారి చరిత్రను చెరిపివేసి దేశం కోసం బ్రిటిష్ వారికి తొత్తుగా పనిచేసిన వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడాన్ని తప్పుపట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని ఆ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకంలో చాలా షరతులు పెట్టి చాలామంది విద్యార్థులకు అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయకుండా జీవో నెంబర్ 107 108 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఎఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలు రాబోయే కాలంలో నిర్వహించేందుకు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వికాస్, చరణ్, గణేష్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాతల కళ్లల్లో ఆనందం

- సుఖీభవ పథకంతో రైతు సంక్షేమానికి పెద్దపీట
- విజయోత్సవ ర్యాలీలో మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు : అన్నదాత సుఖీభవ పథకం లో భాగంగా రైతుల ఖాతాలలో డబ్బులు జమ కావడంతో రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందని మంత్రి సంధ్యారాణి అన్నారు.మంగళవారం పట్టణంలో సుమారు 200 ట్రాక్టర్లతో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి కొద్దిసేపు స్వయంగా ట్రాక్టర్ నడపడంతో పాటు ట్రాక్టరుపై ప్రయాణిస్తూ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. రైతుల సంక్షేమం, పంటల అభివృద్ధి, సాగునీటి విస్తరణ, పంట నష్టపరిహారం వంటి అంశాలలో ప్రభుత్వం సాధించిన విజయాలను తెలియజేశారు. గత ప్రభుత్వంలో రైతు పండించిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు రైతును నానా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వరదలు, వర్షాభావం, మార్కెట్‌లో గిట్టుబాటు ధర సమస్యలతో బాధపడుతున్న రైతులకు ప్రత్యేక ప్యాకేజీలతో నష్టపరిహారం కూటమి ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. పోలవరం, హంసపాడు, సుజల స్రవంతి వంటి సాగునీటి ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే ఆర్.పి.భంజ్‌దేవ్, ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, గూడేపు యుగంధర్, గుళ్ళ వేణుగోపాల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, సీనియర్ నాయకులు కూనిశెట్టి భీమ, కరిబుగత భాస్కరరావు, ఆముజూరి శ్రీనివాసరావు, ఎక్కుడు గణపతి, మత్స శ్యాం అక్కాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు .

పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టని పంచాయితీ అధికారులు

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సింహాచలం

విశాలాంధ్ర -దుంబ్రిగుడ: పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టడం లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. కే సింహాచలం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతంగి పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై దృష్టి పెట్టక పోవడం సరికాదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందనిచెప్పారు. మండల కేంద్రంలోని అరకు పాడేరు ప్రధాన రహదారు లకు ఇరువైపులా వయ్యారిభామ వివిధ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి అన్నారు. గ్రామానికి వెళ్లే ప్రధాన సిసి రోడ్లకు ఇరువైపుల కూడా పిచ్చి మొక్కలు పెరగడం వల్ల దీంతో నిత్యం అదే సిసి రోడ్ల నుంచి రాకపోకలు గ్రామస్తులు సాగిస్తుంటారని చెప్పారు. ఎక్కువగా మొక్కలు పెరిగి ఉండడం వల్ల విష సర్పాలు వంటి జంతువులు సెంచరిస్తుంటా యని దానివల్ల ఎప్పటికైనా ప్రమాదమే అని అభిప్రాయం వ్యక్తం చేశారు. వర్షాల వల్ల పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉండటం వల్ల గ్రామస్తులు కూడా రోగుల పాడిన పడే అవకాశం ఉందని చెప్పారు. ఈవిషయంపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

కొట్నాపల్లి నల్లరాయి క్వారీ తక్షణమే మూసివేయాలి

ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి క్వారీ బాధితులు ఫిర్యాదు

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలో గల కొట్నాపల్లి నల్లరాయి క్వారీ తక్షణమే మూసివెయ్యాలని స్థానిక గ్రామస్తులు మంగళవారం ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్రకు కోట్నాపల్లి నల్లరాయి క్వారీ బాధితులు పిర్యాదులు చూసారు. ఈ సందర్భంగా కిలో సురేంద్ర స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నల్ల రాయి క్వారీ హైవే రోడ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారని హైవే రోడ్ పనులు పూర్తయ్యి ఏడాది గడిచిన కొనసాగుతూనే ఉందని ఆయన అన్నారు. క్వారీ వలన స్థానిక ఆదివాసుల భూములు, తోటలు, ఇల్లులు నష్టం కల్గిస్తున్న క్వారీ తక్షణమే అనుమతులు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైవే రోడ్డు ముగిసినప్పటికీ చట్టవిరుద్ధంగా క్వారీ కొనసాగుతున్న నందున ఈ విషయంపై ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత సహకార అధికారులు జోక్యం చేసుకుని తక్షణమే క్వారీ మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటి కార్యదర్శి టీ.కృష్ణారావు, మండల వైస్ ఎంపీపీ ఎస్, కొండలరావు పెసా కమిటీ కార్యదర్శి జి.ప్రసాద్ గ్రామస్తులు పీ.శ్రీను, కె.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై దమ్ము ట్రాక్టర్లు నడపవద్దు...

విశాలాంధ్ర -రాజవొమ్మంగి : మన్యంలో చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతుంటే, రోడ్డు ఉన్న గ్రామాలకు ఆ రోడ్లను కాపాడుకోవడం పెద్ద సమస్యగా మారింది. వ్యవసాయ సీజన్ వచ్చిందంటే దమ్ము ట్రాక్టర్లు తారు, సిమెంట్ రోడ్లపై తిరుగుండడం వలన రోడ్లు ఛిద్రమై గోతులమయంగా మారుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు రోడ్లు వేయాలంటే ఎంతకాలం పడుతుందో తెలియదు,ఈ విషయమై రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు లోత రామారావు పిర్యాదు మేరకు జడ్డంగి ఎస్సై చినబాబు ఆయా ప్రాంతంలో తిరిగే దమ్ము ట్రాక్టర్ల యాజమానులను, డ్రైవర్లను హెచ్చరించారు,ఇకనుంచి రోడ్లపై దమ్ము ట్రాక్టర్లు తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా రహదారులు అందరి సౌకర్యం కోసం నిర్మించబడినవవి అని, వీటిని పాడుచేయడం చట్టవిరుద్ధమే కాకుండా, సామాజిక బాధ్యతా విస్మరణ కాబట్టి, ఎవరికైనా రహదారులపై దమ్ము ట్రాక్టర్లు నడుపుతున్నట్లు గమనించినచో వెంటనే 944900766 నంబర్‌కి కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

దారకొండ కేంద్రంగా మండలంను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం దారకొండలో మండల కేంద్రం ఏర్పాటుకు చేయాలని ఆరు పంచాయితీల తాజా, మాజీ, సర్పంచులు, ఎంపిటిసిలు, పెసా కమిటీ సభ్యులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, యువత సోమవారం స్థానిక కమ్యూనిటీ హాలు వద్ద సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వారు మండల సాధన కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దారకొండలో మండల కేంద్రం ఏర్పాటు చేస్తే కొంతైనా మన ప్రాంతం అభివఅద్ధి చెందుతుందని, రహదారులు, విద్య, వైద్యం, తాగు నీరు, ఉపాధి అన్ని రకాలుగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని రాజకీయాలు పక్కన పెట్టి అందరూ సమిష్టిగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి మాట్లాడుతూ మండలాల పునర్విభజనకు కూటమి ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తుందని ఈ తరుణంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, మహిళలు యువత ముందుకు రావాలన్నారు. మండల కమిటీ నాయకుడు శోభ జగన్ మాట్లాడుతూ మండలం ఏర్పాటుకు పాడేరు టీడీపీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గిడ్డి ఈశ్వరి సహాయంతో రాష్ట్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లి మండల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీలేరు, దుప్పులవాడ, దారకొండ, గుమ్మిరేవుల, గాలికొండ,అమ్మవారి దారకొండ పంచాయితీ సర్పంచులు పి.దుర్గో, ఎస్.రాజు, ముర్ల కమలమ్మ, దారకొండ ఎంపిటిసి మాడి రామన్న, మాజీ సర్పంచులు రాజు, పి.బాబురావు, జి.రాజు ఏసువరరావు, మాజీ ఎంపిటిసి పీ.గోవింద్, అఖిలపక్ష నాయకులు కారే శ్రీనివాస్, పీ.మల్లుదొర, కె.రాంబాబు, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన చెక్కును కలెక్టర్ అందజేత

విశాలాంధ్ర-పాడేరు : సహజ మరణానికి ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన చెక్కును అందజేసిన జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ చింతపల్లి మండలానికి చెందిన గోకాడ నాగరాజు గత సంవత్సరం మర్చి 24న సహజ మరణం చెందగా వారికి కుమారులైన గోకాడ చరణ్ తేజాకి మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో పియమ్ జెజెవై కేంద్ర ప్రభుత్వం భీమా రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జనని సురక్షా క్యాంపైన్ జూలై 1 నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జిల్లా వారీగా 430 గ్రామ పంచాయతీల్లో అవగాహనా సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఎల్‌డియమ్ మూతునాయుడు అన్నారు. గోకాడ చరణ్ మాట్లాడుతూ తన తండ్రి మరణించిన వెంటనే యూనియన్ బ్యాంకు వారు సత్వరం స్పందించారని, జిల్లా కలెక్టర్, ఎల్డియమ్, యూనియన్ బ్యాంకు వారి సహకారంతో భీమా చెక్ అందిందన్నారు. చెక్కు పంపిణిలో చింతపల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్ గౌతమ్ కుమార్ ఉన్నారు.

నిస్వార్థ పోరాటానికి నిలువెత్తు సాక్ష్యం అల్లూరి

- పెందుర్తి ఎమ్మెల్యే రమేష్ బాబు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అట్టహాసంగా అల్లూరి విగ్రహావిష్కరణ
- విగ్రహాన్ని ఆవిష్కరించిన జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, మాజీ మంత్రి బాలరాజులు

విశాలాంధ్ర-చింతపల్లి : నిస్వార్థ పోరాటానికి నిలువెత్తు నిదర్శనం అల్లూరి సీతారామరాజు అని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి శాసనసభ్యుడు పంచకర్ల రమేష్ బాబు, మాజీమంత్రి పసుపులేటి బాలరాజులు అన్నారు. స్థానిక ప్రభుత్వ డీగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య సమరయోధుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతా రామరాజు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పంచకర్ల రమేష్‌బాబు ముందుగా స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి నుండి డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులతో కలిసి ర్యాలీగా కళాశాలకు చేరుకున్న వారు కళాశాల వద్ద ఏర్పాటుచేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అల్లూరి నడయాడిన నేలగా చరిత్ర పుటలకు ఎక్కిన చింతపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అల్లూరి విగ్రహం నెలకొల్పడం సంతోషకరమన్నారు. స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది పోరాటం చేసి ప్రాణాలర్పిస్తే, స్వాతంత్ర్యంతో పాటు అమాయక గిరిజనులు, అణగారిన వర్గాల కోసం పోరాడి బ్రిటీసర్ల తూటాలకు గుండె చూపి ప్రాణాలర్పించిన త్యాగశీలి అల్లూరి సీతారామరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఇంచార్జ్, పాడేరు నియోజకవర్గ సమన్వయ బాధ్యుడు (పాయింట్ ఆఫ్ కాంటాక్ట్) ఒంపూరు గంగులయ్య ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని, విద్యార్థులతో కలసి ముఖ్య అతిథులు దింసా నృత్యం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అల్లూరి ప్రధాన అనుచరుడైన గామ్ గంటం దొర పేరు పెట్టాలని ఉపాధ్యాయులు, స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం పెందుర్తి శాసనసభ్యుడు పంచకర్ల రమేష్ బాబు, మాజీమంత్రి పసుపులేటి బాలరాజు, ఒంపూరు గంగులయ్య, అల్లూరి సీతారామరాజు ముని మనవడు రామరాజు లను కళాశాల యాజమాన్యం దుస్సాలువాలతో ఘనంగా సత్కరించింది. అదే క్రమంలో కళాశాల మైదానంలో విగ్రహం నెలకొల్పేందుకు కళాశాల యాజమాన్యంతో కలసి ఆర్థిక సహకారమందించిన దూన బోయిన రమణను ముఖ్య అతిధులు దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, చెట్టి ఆనంద్, కిల్లంగి పద్మ, చిరంజీవి, దొరబాబు, వాడకాని నాని, సుర్ల వీరేంద్ర కుమార్, కే వీర వెంకట్, తెదేపా నాయకుడు పెదిరెడ్ల బేతాళుడు, బిజెపి మండల అధ్యక్షుడు బాలకృష్ణ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలమైన పాఠశాల భవనాలతో భయాందోళనలో తల్లిదండ్రులు

- గిరిజన విద్యార్థులు ప్రాణాలంటే ప్రభుత్వానికి చులకనా
- సీపీఐ మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు విమర్శ

విశాలాంధ్ర-కొయ్యూరు : అల్లూరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులను పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఉల్లి సూరిబాబు మాట్లాడుతూ గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో నాడు నేడు అంటూ కల్ల బోల్లి కబుర్లు కబుర్లు చెప్పి కాలక్షేపం చేసిందని విమర్శించారు. పాఠశాలలు భవనాలు సక్రమంగా ఉన్నప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య చేరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కొయ్యూరు మండలంలో ఎం.మాకవరం పంచాయతీ పనసలపాడు,మంప పంచాయతీ తుమ్మలమంద దౌనురు పంచాయితీ ధర్మవరం పాఠశాలలు పరిస్థితి మరింత అధ్వానంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు పాలకులు మారుతున్న గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మాత్రం రూపురేఖలు మారడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలోనైనా గిరిజన ప్రాంతంలో మరీ ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలను మరమ్మత్తులు చేపట్టి శిథిలావస్థకు చేరుకున్న చోట నూతన భవనాలు నిర్మించి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే విధంగా ప్రభుత్వము చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో భారీ ఎత్తున ఉద్య మానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ అల్లూరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఇరవాడ దేముడు గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి పోట్టుకూరి మల్లేష్, గిరిజన సమైక్య మండల అధ్యక్షులు మొల్ల నాగరాజు గిరిజన సమైక్య కార్యదర్శి పొట్టుకూరి దార మల్లేశు సిపిఐ సీనియర్ నాయకులు కాకర రాంబాబు ఉల్లి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన్యం జిల్లా ఎరుకుల కులం సేవా సంఘ కమిటీ జిల్లా అధ్యక్షునిగా మరిశర్ల సత్యం

విశాలాంధ్ర-బలిజపేట : మండలం వెంగాపురం గ్రామానికి చెందిన ఏరుకుల కులానికి చెందిన మరిచర్ల సత్యం పార్వతిపురం మన్యం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏరుకుల కులం సేవా సంఘం అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో మట్లాడుతూ తెలియజేశారు. ఆదివారం పార్వతిపురంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో జిల్లా 11మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటుచేసి అందులో ఎం.సత్యం జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కొని తీర్మానం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎరుకల కులం సేవా కమిటీ అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాస గేదెల లక్ష్మణ గేదెల సత్తిబాబు సూర్యనారాయణ సన్యాసిరావు పద్మావతి సత్యవతి మరియు ఇతర నాయకులు యువ నాయకులు పాల్గొన్నారు.

దశాబ్దాలుగా సాగు చేస్తున్న కుడుమూరు భూములకు పట్టాలివ్వాలంటూ ధర్నా

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో గల కుడుమూరు 48 సర్వేనెంబర్‌లో గిరిజనులుసాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు వెంటనే సాగు పట్టాల మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య సూకూరు అప్పలస్వామి ఆధ్వర్యంలో మంగళ వారం కోడుమూరు సమీపంలో గల మెట్టవలస వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ మాట్లాడుతూ తాతల కాలం నుండి సాగు చేస్తున్నటువంటి భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి అధికారులు కాలయాపన చేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన భూములకు పట్టాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నెల రోజుల క్రితం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేయగా నెల రోజుల్లో పరిష్కారం చేస్తాము అని నెల రోజుల్లో పట్టాల మంజూరు చేస్తామని చెప్పినా రెవెన్యూ అధికారులు తెలిపారు .రెండు నెలల పైబడిన నేటికీ కూడా పట్టించుకోకపోవడం సరైనది కాదని వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 సందర్భంగా సాగులో ఉన్న గిరిజనులకు పట్టాల మంజూరు చేస్తామని కలెక్టర్ ఆదేశాలను పాటించి కుడుమూరు రెవెన్యూ 48 సర్వే నెంబర్లు సాగు చేస్తున్న గిరిజన భూములకు పట్టాల మంజూరు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిన్నెల గోపాలు గిన్నెల పోతి నాయుడు భీమయ్య కొర్ర కళ్యాణ్ కొర్ర శ్రీనివాసరావు మాదల జమ్మరాజు టీ.తాడియ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలి : డా॥ క్రాంతి కిరణ్మయి

విశాలాంధ్ర-బలిజపేట : చేతులను సబ్బుతో శుభ్రపరచుకొని ఆహారాన్ని తీసుకోవడం వలన నులిపురుగుల నుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ క్రాంతి కిరణ్ తెలిపారు. ఆహార పదార్థాలు తీసుకునే ముందు, తరువాత శుభ్రపరచుకోవడం అలవాటుగా మారాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమం స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో ఎంఈఓ సామల సింహాచలం ఆధ్వర్యంలో జరిగింది. మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ప్రబలుతాయన్నారు. అందుకే వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలని అన్నారు. డీ-వార్మింగ్ డే సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను డాక్టర్ క్రాంతి కిరణ్మయి విద్యార్థులతో నమిలి మింగించారు. ఒక సం.రం నుండి 19 ఏళ్ల వరకు పిల్లలు, విద్యార్థులు వీటిని తప్పక తీసుకోవాలని అన్నారు. మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని, ఈరోజు వేయబడని వారికి ఈనెల 20న మాప్‌అప్ కార్యక్రమంలో మాత్రలు వేయాలని ఆదేశించారు. రక్తహీనతగా గుర్తించిన కిశోర బాలికలకు ప్రతీ రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని కిరణ్మయి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధురి ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్గనిర్దేశం చేసేది యువతే : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : సమాజాన్ని మంచి మార్గంలో నడిచేలా మార్గనిర్దేశం చేసేది యువత మాత్రమేనని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభిప్రాయ పడ్డారు. లయన్స్ క్లబ్, ఎన్సీసీ, ఎయిడ్స్ నియంత్రణ, కళాశాల యాజమాన్యం సారథ్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో బాగా చదివే విద్యార్థులు ఉన్నారని, అందుకే పదో తరగతి, ఇంటర్, డిగ్రీల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారని కితాబిచ్చారు. నేర్చుకున్న విద్యతో క్రమశిక్షణ, విద్యాప్రమాణాలు, నైపుణ్యం పెరగాలని అన్నారు. అంతేగాని విలాసలకు అలవాటు పడి యువత మత్తు పదార్థాలు జోలికి వెళ్లరాదని సూచించారు. విద్యార్థులు నేర్చుకున్న విద్యాబుద్ధులతో డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు యువత అంబాసిడర్లు కావాలని పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు వంటి ఎందరో మహానుభావులు నమ్ముకున్న సిద్ధాంతం, సమాజం కోసం పనిచేసారని గుర్తుచేశారు. అదేవిధంగా ప్రస్తుతం డిగ్రీ చదివే విద్యార్థులందరూ, యువత పెడత్రోవ పట్టకుండా సన్మార్గంలో నడిచేలా సమాజాన్ని దిశా నిర్దేశం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి, నాటు సారా వంటి మత్తు పదార్థాలను నివారించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఇందులో యువత కూడా భాగస్వామ్యమై డ్రగ్స్‌ను, ఎయిడ్స్‌ను నివారించేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణపై పోస్టర్లను ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డా. ఎం.వినోద్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.టి.జగన్మోహనరావు, జానపద కళాకారుడు దామోదర గణపతిరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.చలపతిరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.సీతారామ్, లయన్స్ క్లబ్, ఎయిడ్స్ సిపిఎం శైలజ, కళాశాల అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులను తహసిల్దార్ తనిఖీ

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో ఉన్న ఎరువుల షాపులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాచిపెంట మండల తాసిల్దార్ డి.రవి వ్యవసాయ అధికారి కేతిరుపతిరావుతో కలిసి మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లకు పలు సూచనలు జారీ చేశారు. లైసెన్స్ తప్పకుండా షాపుల్లో ప్రదర్శించాలని అన్నారు.ఆ ధీకృత కంపెనీల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేసి మండలంలో ఉన్న రైతులకు మాత్రమే విక్రయించాలని

ఆదేశించారు.బిల్లు బుక్కులు ఇన్వాయిసులు రిజిస్టర్లు పక్కగా నిర్వహించాలని సూచించారు. నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని రైతులకు ఎరువులు విక్రయించేటప్పుడు ముఖ్యంగా యూరియా వ్యక్తులు చేయించేటప్పుడు అధిక యూరియా వాడటం వలన కలిగే నష్టాలను తెలియజేయాలని అన్నారు. నానో యూరియా ఉపయోగాలను కూడా రైతులకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా కృష్ణ ఎరువులు డిపో, బూర త్రినాధ రావు ఎరువులు డిపో, గురునాయుడుపేటలో ఉన్న బంగారమ్మ ఎరువులు డిపో పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులను ఉద్దేశించి ఎరువుల కొరత ఉన్నది లేనిది తెలుసుకొని జిల్లా కలెక్టర్‌కు తెలియజేస్తామని తెలిపారు. ప్రస్తుతం వరి పంటకు ఎరువులు అవసరం ఉన్నాయని తెలిపారు. మొక్కజొన్న, పత్తి పంటలకు దాదాపు ఎరువుల విక్రయం పూర్తి చేయబడిందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ నాగమణి పాల్గొన్నారు.

నెల్లిపాకలో ఘనంగా 'అన్నదాత సుఖీభవ' రైతుల ట్రాక్టర్ల ర్యాలీ

విశాలాంధ్ర-ఎటపాక : ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో మంగళ వారం నెల్లిపాకలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఒక వరం లాగ సూపర్ సిక్స్ లో భాగంగా లిఅన్నదాత సుఖీభవ పథకంలి కింద సంవత్సరానికి 20వేల రూపాయలు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది .అందులో భాగంగా మొదటి విడతగా 7000 రూపాయలను మన ముఖ్యమంత్రీ చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోడీ , ప్రతి రైతు ఖాతాలో జమ చేసారు. ఎటపాక మండల రైతులు నెల్లిపాకలో 100 ట్రాక్టర్లతో ఘనంగా ర్యాలీ నిర్వహించి, కూటమి ప్రభుత్వానికి హర్షం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్దేశించి మండల అధ్యక్షులు రమేష్ బాబు , సీనియర్ నాయకులు పాటి చలపతిరావు, జిల్లా నాయకులు , కిలారి వెంకటేశ్వరరావు,సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, క్లస్టర్ ఇంచార్జ్ వల్లభనేని చందు మాట్లాడుతూ సూపర్ సిక్స్ లో హామీల్లో భాగంగా ప్రతి రైతు ఖాతాలో 20000 జమ చేయడం జరుగుతుందని, అందులో భాగంగా మొదటి విడుత కింద 7 వేల రూపాయలు, ప్రతి రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందని, అలాగే రైతులకు సబ్సిడీ మీద ఎరువులు విత్తనాలు పంపిణీ చేసామని తెలిపారు. అలాగే ఆగస్టు 15వ తారీకు నుండి శ్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కానూరు బుల్లయ్య, జిల్లా తెలుగు యువత నాయకులు నలజాల .శ్రీకాంత్ , తెలుగు యువత నాయకులు పాటి. సంపత్, ఐటీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ బాచినేని. శ్రీకాంత్, దండముడి. రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డి రామకృష్ణ సెక్రటరీ గో0డెల నరేష్, బూత్ ఇంచార్జిలు ఏలూరి టాగూర్, మాగంటి సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కోసం పనిచేసే పార్టీ టీడీపీ

- అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వరం
- నెల్లిపాకలో రైతుల ట్రాక్టర్ల ర్యాలీ

విశాలాంధ్ర-ఎటపాక : రైతు సంక్షేమం కోసం పనిచేసే పార్టీ టీడీపీ అని, మన జెండాలోనే నాగలి గుర్తు ఉందని, అన్నదాత బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్, ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు మాచినేని రాజేష్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లోకి నిధులు విడుదలైన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్ సూచన మేరకు నెల్లిపాక గ్రామంలో మంగళవారం రైతులు భారీగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలలో భాగమైన అత్యంత కీలకమైన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి రైతు కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. ఎన్ని కష్టాలున్నా ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం సంక్షేమం అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మన ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను జనంలోకి తీసుకెళ్లి అర్థమయ్యేలా వివరించాల్సింది పార్టీ యంత్రాంగమే అని వారు తెలిపారు. నిత్యం పార్టీ క్యాడర్ ప్రజలలో, ప్రజలతో కలిసి ఉండాలని, వారి కోసమే పనిచేయాలని, మరింత మంది మన కూటమి పాలనను మెచ్చాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు చంద్రన్న సారథ్యంలో అమలవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పాటి చలపతిరావు, కిలారి వెంకటేశ్వరరావు, పుట్టి రమేష్, బొల్లా పుల్లయ్య, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, పెనుబల్లి సాయిబాబు, వల్లభనేని చందు, నలజాల శ్రీకాంత్, బాచినేని మల్లేశ్వరరావు, దొండమూడి రాంబాబు, పూరేటి వెంకటేశ్వర్లు, గుత్తా వెంకన్న, కనితి మధు, యూత్ నాయకులు పాటి సంపత్, ఐ టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ బాచినేని శ్రీకాంత్, నెల్లిపాక యూనిట్ ఇంచార్జ్ ఏలూరి వెంకన్న, పసుపులేటి రాంబాబు, అనుగోజు మురళి, పాలడుగు నవీన్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

జిసిసి బంకులో పోన్ పే ఏర్పాటు చేయక ఇబ్బందులు

జిసిసి పెట్రోల్ బంకులపై తనిఖీ చేయని రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి

విశాలాంధ్ర-పాడేరు : ఇప్పుడున్న టెక్నాలజీ యుగంలో ఆర్థిక రంగంలో ప్రతిది ఆన్ లైన్ పేమెంట్ కె.అధిక ప్రాధాన్యత ఇవ్వడంలో అందరు ముందు వరుసలో వుంటున్నారు. చిన్న చితక మొదలు కొని బడా వ్యాపారస్తుల వరకు ఆన్ లైన్ పేమెంట్ కె అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరూ గూగుల్ పే, పోన్ పే, పెట్టిఎం, మొదలగు ఆన్ లైన్ యాప్‌లో అందుబాటులో వాడుతున్నారు. ఒక మాటలో చెప్పాలంటే చిన్న కిల్లి బడి తెరిచికూడా ఆన్ లైన్ స్కానర్ వ్యాపారం చేస్తున్నారు. కాని వేలకు వేలు వ్యాపారం చేస్తున్న జి మాడుగుల మండలం కేంద్రంలో ఉన్న గిరిజన సహకార సంస్థకు చెందిన హెచ్ పి పెట్రోల్ బంకు లో మాత్రం మేనేజర్ కొండబాబు పుణ్యమా...? అని గూగుల్ పే, పోన్ పే, పెట్టిఎం, లాంటి సౌకర్యం ఏర్పాటు చేయక వాహన దారులు ప్రతి రోజూ తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన టూరిస్టులు కావచ్చు, దూర ప్రాంతాల్లో ప్రయాణ దారులు కావచ్చు చేతిలో చిల్లర డబ్బులు లేకుండా అకౌంట్‌లో డబ్బులు ఉందని పోన్ పే, ద్వారా పేమెంట్ చేద్దామని వస్తున్నారు. అనేకులు అలా వచ్చి తమ వాహనాలకు పెట్రోల్ కావచ్చు, డీజిల్ కావచ్చు కొట్టించు కొన్నాకా పోన్ పే చేస్తామంటే లేదనే సరికి ఏం చేయాలో అర్థం కాక కంగు తిన్న పరిస్థితి ఏర్పడుతుంది. ఎవరికి అడగాలి..? ఎవరికి అడిగినా లేదనే అభిప్రాయంతో సమాధానం ఇవ్వటం పట్ల ఏం చేయాలో అర్థం కావడం లేదంటున్న వాహనదారులు, ప్రతిరోజు బంకు వాళ్ళతో గొడవ పడే పరిస్థితి ఏర్పడుతుంది. అత్యవసర ప్రయాణం అర్ధాంతంగా ఆగిపోయే పరిస్థితి. వీటన్నింటికి మేనేజర్ కొండబాబు బే కారణమని పలువురు వాదిస్తున్నారు. ఓ జర్నలిస్టు మిత్రుడికి అత్యవసర ప్రయాణ సమయంలో ఈ బంకులో సమయమంతా వృధా అయింది. తెలియక ముందే డీజిల్ కొట్టించుకొన్నాడు పోన్ పే అనగానే ఇతంతు బయట పడింది వీళ్ళను, వాళ్ళను అడిగి అడిగి అలిసిపోయి గంటల తరబడి వేచి ఉండగా పుణ్యమా అని ఒక మిత్రుడు రాగ అతనికి పోన్ పే చేసి పేమెంట్ చేసి వెళ్ళిన పరిస్థితి. మేనేజర్ కొండబాబు నిర్లక్ష్యానికి ఎంతమంది బలైపోయారో అర్థం చేసుకోవాలి, అలాగని ఒక ప్రభుత్వ బంకులో కూడా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నదకం..? ఇదంతా గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కు తెలిసే జరుగుతుందా..? లేదా...? తెలియకుండా వ్యహరిస్తునదా...? వాహనదారులు మాత్రం రాష్ట్ర జిసిసి చైర్మన్ పెట్రోల్ బంకులు పై తనిఖీలు చేయకపోవడం వల్లనే ఇటువంటి సమస్యలు ఏర్పడుతుందని వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికైనా మేనేజర్ కొండబాబు తన పద్ధతి మార్చుకొని వాహన దారులకు ఇబ్బందులకు గురిచేయకుండా ఆన్ లైన్ పేమెంట్ సౌకర్యం కల్పిస్తారో...? లేక వాహన దారులు బాధలను అర్ధం చేసుకొని గిరిజన సహకార సంస్థ చైర్మన్ స్పందించి సత్వర చర్యలు తిసుకొని సకాలంలో సమస్య పరిష్కారం చేస్తారో..? లేదో వేచి చూడాలి.

నిలువు దోపిడీకి పాల్పడుతున్న మన గ్రోమోర్

విశాలాంధ్ర-బలిజపేట : ప్రభుత్వ ధరలకు విక్రయించవలసిన యూరియాను మన గ్రోమోరు సిబ్బంది అధిక ధరలకు విక్రయిస్తూ నిలువ దోపిడీకి పాల్పడుతున్నారు వివరములకు వెళితే బలిజిపేట మండలంలో గ్రోమోర్ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది చేతివాటముతో రైతులకు యూరియా దొరకక పడరాన్ని పాట్లు పడుతున్నారు ఇటీవల కాలంలో యూరియా నిలువలను సిబ్బంది రెండు వందల అరవై ఏడు రూపాయలకు విక్రయించవలసి ఉండగా బస్తా కు 300 నుండి 400 రూపాయలకు విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు అది మన గ్రోమోర్ పనివేళలా కాకుండా తెల్లవారుజామున, సాయంత్రం సమయములో కొంతమంది మధ్యవర్తులను ఏర్పాటు చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి యూరియా కొరత కారణంగా సకాలంలో ఎరువులు వేసుకోలేని పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గతంలో ప్రతి గ్రామములో దొరికే యూరియా నేడు అధిక ధరలకు కొందామన్న దొరకని పరిస్థితి దాపురించిందన రైతులు ఆవేదన చెందుతున్నారు గ్రోమోర్ తో పాటు పలగర సొసైటీ లో పలుమార్లు యూరియా వచ్చి అప్పటికే అధికార పార్టీ నాయకులు మరియు మధ్యవర్తులు సిఫార్సుల మేరకే పంచుతున్నారే తప్ప రైతులకు అందన పరిస్థితి నెలకొన్నది ఇదే విషయమును అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన స్పందనలేదని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా కొరతను తమకు అనుకూలముగా మలుచుకుని స్థానిక ప్రైవేటు వర్తకులు 300 నుండి 400 రూపాయలకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బలిజిపేట మండలంలో సుమారుగా 19 వేల ఎకరాలు వరి నాట్లు వేయడం జరిగిందని అదేవిధంగా 4000 ఎకరాములలో మొక్కజొన్న వేయడం జరిగిందని దీనికి అవసరమైన యూరియా సుమారుగా మూడువేల టన్నుల యూరియా అవసరమా కాగా ఇప్పటికీ వెయ్యి టన్నుల యూరియా వచ్చిందని మండల రైతాంగము వ్యక్తం చేస్తున్నారు అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతుకు కావలసిన యూరియా కొరతను నివారించాలని అలాగే ప్రభుత్వ ధరలకే విక్రయించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

నీటి వనరుల విధ్వంసానికి ఎక్కడికక్కడ అడ్డుకోవాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : స్వార్థం తలకెక్కిన ప్రస్తుత సమాజంలో భవిష్యత్తు తరాల మనుగడ కోసం ప్రజలే చైతన్యవంతులై నీటి వనరుల ధ్వంసాన్ని ఎక్కడకక్కడ అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ముఖ్య సలహాదారు జగన్నాథ్ ప్రసాద్ రాయగురు అన్నారు. నీటి వనరులకు స్వర్గదాయకంగా ఉన్న ఉత్తరాంధ్రను కరువు రాజ్యమేలటానికి నాయకులు, అధికారుల అవినీతి, నిర్లక్ష్యమే కారణమని తెలియజేశారు. ప్రజలందరూ ముందుకు వచ్చి నీటి వనరుల పరిరక్షణ, వినియోగ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఏర్పడటం ఇది ఒక రకంగా చట్టాల అమలు వైఫల్యంగానే భావించాలి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా చట్టాలను అమలుచేసి నీటి వనరులను పరిరక్షించి ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ : డిఐఓ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మందులు పంపిణీని జిల్లా డిఐఓ డాక్టర్ విజయ్ మోహన్ పరిశీలించారు. మంగళవారం జరిగిన నులిపురుగులు నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండెజోల్ మాత్రలు వేశారు. అనంతరం గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల్లో అక్రమాలు వద్దు : సబ్ కలెక్టర్ వైశాలి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : ఖరీఫ్ సీజన్లో రైతులకు సక్రమంగా అందించాల్సిన ఎరువుల విషయంలో ఆయా వ్యాపారులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటే అని సబ్ కలెక్టర్ వైశాలి హెచ్చరించారు. మంగళవారం తహసిల్దార్ సురేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి అశోక్ సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్న సమయంలో ఆకస్మికంగా ఆమె పట్టణంలో గల మన గ్రోమోర్ కేంద్రాన్ని సందర్శించి ఎరువుల ధరలు, రికార్డుల నిర్వహణ, వివరాలు పరిశీలించారు. ఖరీఫ్ సీజన్లో ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని అలాగే నిబంధనలకు లోబడి గిట్టుబాటు రేటు ప్రకారమే రైతులకు ఎరువులను అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు దాడుల నిర్వహించి ఎరువుల వ్యాపారులకు సూచనలు ఇవ్వాలని రైతులకు ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు.

ఆరోగ్య వంతంగా ఉండాలంటే ఆల్బెండజోల్ తప్పనిసరి : డాక్టర్ ప్రజ్ఞ

విశాలాంధ్ర-కురుపాం : పిల్లలు ఆరోగ్యం గా ఉండాలి అంటే ఏదాది కి ఓసారి నులి పురుగుల మాత్రలు ఆల్బెండజోల్ తప్పనిసరి గా వేసుకోవాల్సిందే అని మొండెంఖల్ పిహెచ్ సి వైద్యులు డా.ప్రజ్ఞ సూచించారు. మంగళవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలం లోని లంకాజోడు ప్రభుత్వగిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత పాఠశాల లో విద్యార్థులకు మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యదికారి డాక్టర్ ప్రజ్ఞ నులిపురుగులు నివారణకు ఆల్బెండెజోల్ మాత్రలు వేయించారు. డాక్టర్ ప్రజ్ఞ మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయి అన్నారు. అందుకే వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లంకాజోడు ప్రభుత్వగిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణశ్రీ, వార్డెన్ తోయక రేవతి, హెల్త్ అసిస్టెంట్ జె. తిరుపతి,యం.కన్నారావు. ఏ ఎన్ యమ్ నిర్మల మరియు స్కూల్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాలొగొన్నారు

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

మండల తహసిల్దార్ వై జయలక్ష్మి హెచ్చరిక

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : రైతులకు ఎరువులు అమ్మేటప్పుడు ఎటువంటి అక్రమాలకు పాల్పడిన చర్యలు తప్పవని మండల తహసీల్దార్ వై. జయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె మండల వ్యవసాయ అధికారిణితో కలిసి చిన మేరంగి బీజేపురం పిఎసిఎస్ కేంద్రాలతో పాటు అలాగే చినమేరంగిలో గల అన్నపూర్ణ ఏజెన్సీ జియ్యమ్మ వలస లో గల మన గ్రోమోర్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులలో గల స్టాక్ రిజిస్టర్ ఎరువుల నిల్వలను ఈ పాస్ మిషన్లను పరిశీలించారు రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగజేయకుండా కావలసిన ఎరువులను ఇవ్వాలని లింక్ ప్రాడక్ట్స్ ను వారికి అంటకట్టరాదని ఆమె హెచ్చరించారు రైతులు కొనే ఎరువులకు కచ్చితంగా రసీదు ఇవ్వాలని ఆమె అన్నారు అధిక ధరలకు ఎరువులను విక్రయించినట్లయితే వారి లైసెన్సు రద్దు చేస్తామని ఆమె వారిని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

గెడ్డలుప్పి సహకార సంఘ అధ్యక్షునిగా సింహాచలంనాయుడు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గెడ్డలుప్పి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా చొంగల సింహాచలం నాయుడు, డైరెక్టర్లుగా భోగి అప్పలనాయుడు, వెన్నెల శంకర్రావులు, నియమించబడ్డారు. తమను నామినేట్ చేసినందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే విజయ్ చంద్రకు, మండల, గ్రామ టిడిపి నాయకులకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. కొత్తగా నియమించబడిన వారిని ఎమ్మెల్యే విజయ్ చంద్ర తన క్యాంపు కార్యాలయంవద్ద సత్క రించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులతో పాటు ఆసొసైటీ పరిధిలోగల వివిధ గ్రామాల టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అంటిపేట సహకార సంఘ అధ్యక్షునిగా భాస్కరరావు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని అంటిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా ఏగిరెడ్డి భాస్కరరావు, డైరెక్టర్లుగా యాళ్ళ పైడిపు నాయుడు, యాండ్రాపు పోలినాయుడులు నియమించబడ్డారు. తమను నామినేట్ చేసినందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే విజయ్ చంద్రకు, మండల, గ్రామ టిడిపి నాయకులకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. కొత్తగా నియమించబడిన వారిని ఎమ్మెల్యే విజయ్ చంద్ర తన క్యాంపు కార్యాలయంవద్ద సత్కరించారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి నాయకులతో పాటు ఆసొసైటీ పరిధిలోగల వివిధ గ్రామాల టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మన అందరి బాధ్యత : ఎస్ఐ

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని ఎస్సై పాపి నాయుడు అన్నారు.ప్రపంచంలో పేరుగాంచిన ప్రముఖ పర్యటక కేంద్రమైన చాపరాయి జలవిహారి వద్ద ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహనపరిచారు. ఈసందర్భంగా వాహన దారులతో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనంలో ప్రయాణించేటప్పుడు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని చెప్పారు. రోడ్డుపై ప్రతి ఒక్కరు ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలతో ప్రయాణిస్తూ ఇతరులకు కూడా రక్షించాల్సిన బాధ్యత కలిగి ఉండాలని చెప్పారు. ప్రయాణంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా అనేకమంది ప్రయాణం చేస్తూ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15న సంబర పోలమాంబ ఆలయంలో కుంకుమ పూజ

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో పవిత్ర గోముఖీ నదీ తీరమున వెలసిన ప్రముఖ ఇలవేల్పు ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత అయిన శ్రీ పోలమాంబ అమ్మవారి ఆలయం చదురుగుడి నందు స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం శ్రావణమాసం సందర్భంగా తే 15-08-2025 ది 4వ శుక్రవారం సామూహిక ఉచిత కుంకుమ పూజలు ఉదయం 9-00 గంటలకు ప్రముఖ ఋత్విక్కులచే జరుపబడును. కావున భక్తులు, స్త్రీలు అందరూ కుంకుమ పూజా కార్యక్రమంలో పాల్గొని శ్రీ పోలమాంబ అమ్మవారి దివ్య ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదములు స్వీకరించ కోరుచున్నాము. పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శ్రీ అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, తమలపాకులు వగైరా పూజ సామాగ్రి దేవస్థానము నుండి ఇవ్వబడును. పూజలో పాల్గొను భక్తులు కలశం, కొబ్బరికాయ, ఆచమనపాత్ర, పూలు, అమ్మవారికి నైవేద్యం వగైరా తీసుకొని రాగలరు. ఆలయ కార్యనిర్వహణ అధికారి బి శ్రీనివాసరావు తెలియపరిచారు.

రెడ్ రిబ్బన్ క్లబ్ విద్యార్థులకు టోపీలను కలెక్టర్ అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం: స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీకళాశాలలో చదువుతున్న 100మంది గిరిజన విద్యార్థులకు రెడ్ క్రాస్ సొసైటీ అందజేసిన టోపీలను జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఇప్పటికే 100మందికి టీషర్టులను కూడా అందజేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు తెలిపారు. ఉన్నత విద్యా మండలి కమిషనర్ ఆదేశాల ప్రకారం కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా రెడ్ రిబ్బన్ కబ్లో చేరినట్లు తెలిపారు. చేరిన విద్యార్థులు సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కరరావు, డిఎంఓ డాక్టర్ మంతిని వినోద్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బలగ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పేజి : 3

- అల్లూరి సీతారామరాజు
- పార్వతీపురం మన్యం

బుధవారం 13, ఆగస్టు 2025

అమ్మవారిని దర్శించుకున్న వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్

విశాలాంధ్ర-బెలగాం : వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వి.ఎన్. కుసుమంచి వెంకటరావు పార్వతీపురం ఆడబడి వీధిలో గల శ్రీ శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంను సందర్శించారు. వాసవీ క్లబ్ పార్వతీపురం సెంట్రల్ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మవారికి సారే చీర సమర్పించారు. అనంతరం పట్టణంలో గల పేదలకు అన్నదానం చేశారు. భవిష్యత్తు సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు మమ్ముల విశ్వేశ్వరరావు, వాసవీ క్లబ్ కార్యదర్శి తమ్మాన లక్ష్మీ, కోశాధికారి వరదా ఉదయ్ కుమార్, జోన్ చైర్మన్ నారాయణం చిన వెంకటరెడ్డి (రాజేష్), జిల్లా అధికారి పేకేటి పుండరీకాక్ష, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర-ఎటపాక : ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా యాత్ర ఎటపాక మండలం నెల్లిపాక, తోటపల్లి గ్రామాలలో జెడ్పీ ఎస్ ఎస్ ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థినీ విద్యార్థులతో తిరంగా యాత్ర చేపట్టారు. తిరంగా యాత్ర విశిష్టత దాన్ని ప్రధాని మోడీ ఎందుచేత ప్రవేశపెట్టారు అనే విషయాలను విద్యార్థిని విద్యార్థులకు మండల అధ్యక్షులు తెలియజేసారు. అలాగే స్వతంత్ర సమరయోధుల ప్రాణత్యాగాలు చిరస్మరణీయమని, మరచిపోలేనివి అని కొనియాడారు. ప్రతి ఒక్కరు కూడా దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భరతమాత వీర ముద్దు బిడ్డలను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు షేక్ ఆశాబి, కొర్సా రామకృష్ణ, గుండి.నాగిరెడ్డి, నెల్లిపాక, తోటపల్లి ఉన్నత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-ఎటపాక : రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం అని ఎటపాక సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మంగళ వారం నెలిపాక లో రైతులు ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తుందని వెల్లడించారు. విత్తనాల పంపిణీ నుంచి ఎరువులు, సాగునీరు తదితర విషయాల్లో రైతులకు మేలు చేసే విధంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువు దుకాణాలు తనిఖీలు

ఎంఆర్‌పి రేట్‌కి మించి అమ్మితే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి చింతల భారతి మరియు మండల రెవెన్యూ అధికారి భరత్ కుమార్ కలిసి మన్యం కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల ప్రకారం ఐదు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది ఈ తనిఖీ లో భాగంగా గ్రౌండ్ బ్యాలెన్స్ మరియు ఈపాస్ మిషన్ యొక్క బ్యాలెన్స్ మరియు స్టాక్ బుక్ బిల్ బుక్స్ తనిఖీ చేయడం జరిగింది అలాగే ఎరువులు దుకాణదారులు స్టాక్ బోర్డులో ఎరువులు లభ్యత ప్రదర్శించవలసిందిగా చెప్పడం జరిగినది అలాగే రైతులకు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాల్సిందిగా ఆదేశించడం జరిగింది, ఎరువులు అమ్మేటప్పుడు లింక్ ప్రొడక్ట్స్ ఇవ్వద్దు అని చెప్పడం జరిగింది, ఎం ఆర్ పి రేట్ కన్నా ఎక్కువ అమ్మితే చర్యలు తీసుకోబడతాయి అని చెప్పడం జరిగింది.

శక్తి టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని పలుపాఠశాలలో శక్తిటీం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఏ ఎస్ఐ శ్రీరాములు, హెడ్ కానిస్టేబుల్ సీతయ్య, మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఫాతిమలు మహిళల చట్టాలపై అవగాహన, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మకర్త పదవులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-మక్కువ : మండలంలోని సంబర గ్రామంలో వెలిసినటువంటి శ్రీ శ్రీ సంబర పోలమాంబ దేవస్థానమునకు, ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ & హిందూ రిలీయాజస్ దేవాలయంలో మరియు దేవాదాయ ధర్మ శాఖ చట్ట ప్రకారం37/87 కాళ అనుగుణముగా సవరించబడిన ప్రకారం శ్రీయుత నెంబర్ సెక్రెటరీ. ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం వంశపార పర్యాతర ధర్మకర్త పదవికి దరఖాస్తులు కోరినందున ఆసక్తి గల వ్యక్తులు సదరు దరఖాస్తు ఫారం ను సదరు దేవాలయ కార్యాలయం పలివేలలో కార్యాలయమునకు వచ్చి తీసుకొని ఈ నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ 11. 8. 2025 నుండి పది రోజుల్లోగా ఫారం ను గురించి అవసరమగున పత్రములు జత చేసి ఆలయ కార్యనిర్వక అధికారి వారి కార్యాలయం శ్రీ పోలమాంబ అమ్మవారి దేవాలయం నకు అందజేయగలరని ఆలయ కార్యనిర్వక అధికారి బి శ్రీనివాసరావు తెలిపారు.

అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోండి

- గడచిన నాలుగేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు

ఉరిసింగి, మామిడిపల్లి గ్రామాలలో సీసీ డ్రైన్ల నిర్మాణాలకు ఎంపీపీ, జెడ్పీటీసీలు శంకుస్థాపన

విశాలాంధ్ర-చింతపల్లి : గడచిన నాలుగేళ్లలో జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య లు అన్నారు. మండలం లోని కొత్తపాలెం పంచాయతీ ఉరిసింగి, మామిడిపల్లి గ్రామాలలో స్థానిక సర్పంచ్ వనగల సోమరత్నం, వైస్ ఎంపీపీ గోపినాయక శారద లతో కలిసి జిల్లా పరిషత్ నిధులు 10 లక్షల రూపాయలతో మంజూరైన మురుగు కాలువల పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతోమండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా మండలంలో త్రాగునీటి సమస్య తీర్చడానికి సుమారు నలభైకి పైగా త్రాగునీటి బోర్లు వేయించామన్నారు. సిమెంటు రహదారులు, మురుగు కాలువలు, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అరకు పార్లమెంటు సభ్యురాలు గుమ్మ తనుజా రాణితో మాట్లాడి చింతపల్లిలో సామాజిక భవన నిర్మాణానికి నలుబై లక్షల రూపాయలు మంజూరు చేయించడమే గాక భవన నిర్మాణానికి పనులు కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. అటు జిల్లా పరిషత్ చైర్ పర్సన్,

అరకు పార్లమెంట్ సభ్యురాలు తనుజారాణిలతో సమన్వయం చేసుకుని మండలంలో గల ఏకలవ్య, ఆశ్రమ పాఠశాలలో ఆర్‌.ఓ. ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజ రాణికి సమర్పించడం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన ఆమె తన నిధులతో ఆర్‌.ఓ. ప్లాంట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజ రాణి లకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ వైస్ సర్పంచ్ పాంగి మోహన్ రావు, వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జెల్లీ సుధాకర్, వైకాపా రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏ ఈ గడుతూరి స్వర్ణలత, పంచాయతీ వార్డు సభ్యులు భీమరాజు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి, పాడేరు ఇంచార్జి గిడ్డి

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో అన్నదాత సుఖీభవ తొలివిడత రైతుల ఖాతాలో జమ కావడంతో పాడేరు నియోజకవర్గం ఇంచార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో తలారిసింగి నుండి పాతబస్టాండ్ వరకు రైతు సంబర భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వర్ధిలాలి అంటూ నినాదాలు చేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పాడేరు నియోజకవర్గం ఇంచార్జి గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికలో ఇచ్చిన హామీ సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తుచా తప్పకుండా అమలు చేస్తుందని రైతులకు రైతు బంధుగా అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందాన్నారు. రైతుల ఖాతాలో నేరుగా ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా డబ్బులను ప్రతి రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు.రైతులకు భరోసాగా రైతులకు సంవత్సరానికి 20వేల రూపాయలు విడతల వారీగా రైతు ఖాతాలో జమ చేస్తామని చెప్పిన మాట తప్పకుండ అమలు చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని,అన్నదాతలకు అండగా నిలవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గతంలో రైతులకు వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని సంవత్సరానికి 14వేల రూపాయలు రైతులకు ఇస్తామని చెప్పి దానిని పూర్తిగా అమలు చేయని పరిస్థితి గతంలో చూశామని ప్రజా సమస్యలను తక్షణమే పరిస్కారం చూపే గొప్ప ప్రభుత్వం టీడీపీ కూటమి ప్రభుత్వమని రైతులకు ఆర్థికంగా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వం ధ్యాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ కూడ కృష్ణారావు,బీజేపీ అల్లూరి జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతి కుమారి,బీజేపీ సీనియర్ నాయకుడు కురుసా ఉమామహేశ్వరరావు,పీ ఏ సి ఎస్ చైర్మన్ దప్పొడి వెంకటరమణ, సూపర్ ఎంపీపీ రమణ మూర్తి,జి. మాదుగుల అప్పలరాజు,చింతపల్లి మండల అధ్యక్షులు పూర్ణచ్చందర్ రావు,బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు,దారేలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి,శోభకోట సర్పంచ్ పలాసీ శశి భూషణం నాయుడు, అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ,టీడీపీ నాయకులు రాధాకృష్ణ,డి,వి కుమారి,మర్ల మణి త్రినాథ్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయలను వేధింపులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వం : ఎస్టీయూ

విశాలాంధ్ర-సీతంపేట : విద్యారంగంలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు రోజురోజుకు ఉపాధ్యాయుని పై వేధింపులుకు గురి చేస్తూ బోధనేతర పనుల భారం మోపుతూ బోధనకు దూరం చేసే విధంగా ఉన్నాయి అని ఎస్టియూ జిల్లా అధ్యక్షులు పాలక పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలు రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని ఒకవైపు ఘోషిస్తుంటే మరోవైపు ప్రభుత్వం రోజు రోజుకు బోధనేతర పనుల బారం మోపుతూ బోధనకు దూరం చేస్తున్నది. స్వేచ్ఛపూరిత వాతావరణంలో బోధనకు అవకాశం లేనప్పుడు సామర్థ్యాదార బోధన ఎలా సాధ్యం, పాఠశాలల ప్రారంభం నుండి వివిధ రకాల యాపులు నిర్వహణ, ఆన్లైన్ పనులు, యోగాంధ్ర, మెగా పేరెంట్స్ మీటింగ్, ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణ, లీడర్షిప్ ట్రైనింగ్ లాంటి బోధనేత కార్యక్రమాలతో ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారని దీనివలన విద్యార్థులకు బోధన కుంటుపడుతుంది. ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో భాగంగా తీసుకొచ్చిన అసెస్మెంట్ బుక్ లెట్ విధానం తీవ్ర గందరగోళానికి గురి చేస్తున్నది. సంవత్సరం పొడుగుతా నిర్వహించే సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షలను ప్రతి విద్యార్థి అదే పుస్తకంలో రావాల్సి ఉండడం, ఎఫ్ఎ-1, ఎస్ఏ -2 పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలు సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల్లో పునరావృతం అయ్యే అవకాశాలున్న నేపథ్యంలో చూచిరాతకు ఆస్కారం ఉన్నది. ఇలా ఉంటే

విద్యార్థుల సామర్థ్యాలను ఎలా మదింపు చేయాలి,వందల సంఖ్యలో పిల్లలు ఉన్న పాఠశాలలలో బుక్లెట్లను భద్రపరచడం తలకి మించిన భారమని, పరీక్ష నిర్వహణ, పిల్లల ప్రతిస్పందన నమోదు, ఓఎంఆర్ బబ్లింగ్, మూల్యాంకన పత్రాలను స్కానింగ్ చేసి యాప్ లో అప్లోడ్ చేయడం, ఆన్లైన్ లో మార్కుల నమోదు తదితర పనులు రోజుల తరబడి చేయాల్సిన పరిస్థితి. ఏకోపాధ్యాయ పాఠశాలలు, అధిక సంఖ్యలో పిల్లలు ఉన్న ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తీవ్రమైన పని భారంతో మానసిక ప్రశాంతత లేని పరిస్థితులు సంస్కరణలు తీసుకొచ్చే ముందు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడాన్ని సంఘ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం . సంస్కరణలు విద్యా ప్రమాణాలు పెంచే విధంగా ఉండాలి తప్ప, బోధనను హరించే విధంగా ఉండకూడదు .. వెంటనే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ సరికొత్త పరీక్షల సంస్కరణలకు స్వస్తి పలికి, పాత పద్ధతిలోనే పరీక్షల నిర్వహించేలా చూడాలి . పాఠశాల స్థాయిలో బోధనేతర పనులను పూర్తిగా రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలి అని తెలిపారు.

జనసేన పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయండి

- స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలి
- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం
- జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యంలో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికునిలా పని చేయవలసిన అవసరం ఉందని ఆ పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి శాసనసభ్యుడు పంచకర్ల రమేష్ బాబు అన్నారు. ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం ఆధ్వర్యంలో చింతపల్లిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో అరకు పార్లమెంట్ ఇంచార్జ్, పాడేరు నియోజకవర్గ బాధ్యుడు ఒంపూరు గంగులయ్యతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గంగులయ్య అధ్యక్షతన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాలలో కూటమి ప్రభుత్వాలు కొలువుదీరి ఏడాది దాటిందన్నారు. ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో తెదేపా, బీజేపీ లతోపాటు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకు వెళ్ళవలసిన బాధ్యత ప్రతి ఒక్క జన సైనికుని పై, వీర మహిళలపై ఉందన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ అభ్యర్థులతో పాటు, కూటమి పార్టీలకు చెందిన

అభ్యర్థులను గెలిపించుకునేందుకు జన సైనికులు, మిత్రపక్షాలైన తెదేపా, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ క్రమంలో జనసేన పార్టీ మన్య ప్రాంతంలో మరింత బలమైన పార్టీగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు జనసేన పార్టీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. చిత్తశుద్ధితో పార్టీకి పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వీర వెంకట్, వంతల బుజ్జిబాబు, కిముడు కృష్ణమూర్తి, సుర్ల వీరేంద్ర కుమార్, గాజుల శ్రీనివాస్, వీర మహిళ పద్మ, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

'శెట్టి అప్పాలు'ను ఎమ్మెల్సీ రవిబాబు పరామర్శ

విశాలాంధ్ర-అరకులోయ : వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు ను వైసీపీ ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది వైద్యుల సలహాల మేరకు బెంజిపూర్ గ్రామములోని తన నివాస గృహములో విశ్రాంతి పొందుతున్న శెట్టి అప్పాలును మంగళవారం వైసీపీ ఎమ్మెల్సీ కుంభ రవిబాబు పరామర్శించి వారి కుటుంబాన్ని ధైర్యం పరిచారు. అనారోగ్యం సమస్యలు ఎల్లవేళలా ఉండవని వైద్యుల సలహాలతో సరైన చికిత్స పొందుతూ త్వరగా కోలుకొని వైసీపీ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన అభిలాసించారు. పక్కనే ఉన్న అల్లూరి జిల్లా వైసీపీ మహిళా ఉపాధ్యక్షురాలు మాజీ ఎంపీపీ అరుణ కుమారితో కాసేపు సంభాషించి అప్పాలు ఆరోగ్యానికి సంబంధించిన విషయాలు క్షుణంగా క్షుణంగా అడిగి తెలుసుకున్నారు. ఆ ధైర్య పడవద్దని అప్పాలు సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మారి మరింత ఉత్సాహంతో వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన అరుణకుమారి వద్ద అన్నారు. ఎమ్మెల్సీ రవిబాబు తమ ఇంటికి వచ్చి పరామర్శించి ధైర్యం చెప్పడంపై అప్పాలు, అరుణకుమారి ఆనంద ఉద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బూర్జ సుందర్రావు,గొల్లూరి గోపాల్,పెద్దమజ్జి అర్జున్,సాగర రామారావు,లోకోయి సీతారం, వంతాల అప్పన్న, పాంగి సింహాద్రి, కొర్ర బాబురావు,ధర్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు పోలీసులు అవగాహన

విశాలాంధ్ర-ఎటపాక : ఆటో డ్రైవర్లకు పోలీసులు అవగాహన కార్యక్రమం ఎటపాక లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటపాక సిఐ కన్నప్పరాజు మాట్లాడుతూ ప్రతీ డ్రైవర్ లు మహిళా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, ఎటువంటి నేరాలకు పాల్పడకుండా గమ్యస్థానాలకు చేరవేయా లన్నారు. నేరచరిత్ర కలిగిన ఆటో డ్రైవర్ల కదలికలపై ప్రత్యేక బృందాలు పనిచేస్తుంటాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మానుకొని ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు అధిగమించి ప్రయాణికులను ఎక్కించరాదని, యూనియన్ డ్రైవర్లు అందరూ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు ఉంటే తమకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎటపాక ఎస్సై అప్పలరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలి : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-బెలగాం : చేతులను సబ్బుతో శుభ్రపరచుకొని ఆహారాన్ని తీసుకోవడం వలన నులిపురుగుల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆహార పదార్థాలు తీసుకునే ముందు, తరువాత శుభ్రపరచుకోవడం అలవాటుగా మారాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమం స్థానిక డివిఎం పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ప్రబలుతాయన్నారు. అందుకే వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలని అన్నారు. డీ-వార్మింగ్ డే సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ విద్యార్థులతో నమిలి మింగించారు. ఒక సం.రం నుండి 19 ఏళ్ల వరకు పిల్లలు, విద్యార్థులు వీటిని తప్పక తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని, ఈ రోజు వేయబడని వారికి ఈనెల 20న మాప్‌అప్ కార్యక్రమంలో మాత్రలు వేయాలని ఆదేశించారు. రక్తహీనతగా గుర్తించిన కిశోర బాలికలకు ప్రతీ రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కరరావు, ఆర్.బి.ఎస్.కె పిఓ డా. టి. జగన్మోహనరావు, డిఈఓ బి. రాజ్ కుమార్, స్టేట్ కన్సల్టెంట్ డా. కె. కిరణ్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డా. రఘు, డా. ఎం. వినోద్ కుమార్, డా.కౌశిక్, వైద్యాధికారి డా. లావణ్య, హెచ్‌ఎం శ్రీధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గుమ్మలక్ష్మీపురం గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాల శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జన్మదినోత్సవం పురస్కరించుకొని జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం కార్యక్రమాన్ని జరిపినారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీవరం మాట్లాడుతూ డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రాన్నికి చేసిన ఎనలేని సేవలను కొనియాడారు. ఆయన వలన భారతదేశంలో గ్రంథాలు అభివృద్ధి నూతన గ్రంథాలు నెలకొల్పబడ్డాయి అని గ్రంథాలయ చట్టాలను ఏర్పాటు చేసుకోవడంలో ఆయన కృషి అమోఘమైనది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రంథపాలకుడు డాక్టర్ జి.ప్రభాకర్ మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్రనికి పంచ సూత్రాలను డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథ అందించారని ప్రస్తుత డిజిటల్ యుగంలో కూడా ఆ పంచ సూత్రాల మీదే గ్రంథాలయాలు నడుస్తున్నాయని ఆయన వలనదేశంలో గ్రంథాలయ శాస్త్రానికి అపూర్వమైన స్థానం లభించిందని ఆయన వర్గీకరణ సిద్ధాంతం అభివృద్ధి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి.కల్పన, ఎ.శ్రీవాణి, జె.స్వరూప, జి.తులసి పి.కృష్ణారావు మరియు సిబ్బంది విద్యార్థివిద్యర్థులు పాల్గొన్నారు.

మండలంలో విస్తృతంగా పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర-అనంతగిరి : పశువైద్య శిబిరాలలో భాగంగా మంగళవారం భీంపోల్ పంచాయితీ నందకోట, బి కొత్తకోట, లువ్వా గొంద్రిగిపాడు గుడ్డి మామిడి వలస గ్రామాలలో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధి బారినపడిన 84 పశువులకు చికిత్స చేయడం జరిగింది. ఇందులో భాగంగా, 510 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు 426 మేకలు గొర్రెలకు పారుడు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. కాశీపట్నం పశువైద్యాధికారి సాగరి గణేశ్వరరావు తెలిపారు. పశు వ్యాధులు వాటి నివారణ గూర్చి రైతులకు అవగాహన కల్పించడం జరిగిది అన్నారు. పశుసంపద మీద ఆధారపడిన రైతుల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయడానికి నిర్వహిస్తున్న బ్లాంకెట్ సర్వేను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. భీంపోల్ మరియు బొర్రా రైతు సేవ కేంద్రం రైతు సదస్సులో రైతులను ఉద్దేశించి ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు మరియు పథకాలు ముఖ్యంగా , కిషన్ క్రెడిట్ కార్డుల ద్వారా తక్కువ వడ్డీతో బ్యాంక్ రుణాలు, పశు బీమా, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశుశాలలు మరియు పశుగ్రాసాల సాగు మొదలగు విషయాలు వివరించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భీంపోల్ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి జన్ని భిమలమ్మ, ఎంపిటీసి శిరగం అశోక్‌కుమార్, బొర్రా పంచాయతీ సర్పంచ్ అప్పారావు, జూనియర్ వెటర్నరీ అధికారి జగదీష్ మరియు సచివాలయ పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పరిశీలన

విశాలాంధ్ర-కొమరాడ : ప్రపంచ పులి పురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్ర సంయుక్త డైరెక్టర్ డాక్టర్ జి.జనార్ధమ్ ఆయన పరిశీలించారు ముందుగా కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ముందుగా పొరూరుకారుల పరిశీలించారు అనంతరం బాలురు వసతి గృహాన్ని గృహాన్ని జడ్పీహెచ్ విక్రంపురం అంగన్‌వాడీ సెంటర్ వద్ద కింద పేర్కొన్న చర్యలు అమలులో అవసరమైన మోతాదులో అల్బెండజోల్ ఔషధం అందుబాటులో ఉంచడం ప్రాంగణంలో శుద్ధమైన త్రాగునీరు అందుబాటులో ఉంచడం అనంతరం ఆయన మాట్లాడుతూఅంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన మోతాదు అందించడంపై ప్రత్యేక శ్రద్‌అనాఫైలాక్టిక్ రియాక్షన్ డ్రగ్ కిట్ నిర్వహణ ప్రాంగణంలో (సమాచారం, విద్య, ప్రచారం) పత్రాలు ప్రదర్శించడం మందు ఇచ్చే ముందు పిల్లల ఆరోగ్య పరిస్థితి పరిశీలించడంమాత్ర ఇచ్చిన తరువాత కొంతసేపు గమనించడం, ప్రతికూల ప్రభావాలు ఉన్నాయా అర్హులైన ప్రతి బాలబాలికకు సురక్షితమైన సమర్థవంతమైన కృమినాశనం అందించడం ద్వారా, సమాజ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మరియు రక్త హీనత అరికట్టడం లక్ష్యం. ఆరోగ్య పరిస్థితి బాగోని పిల్లలకు మరల 90 రోజులు తేదీన వేయాలని గుర్తు చేసారు ఆయన తెలిపారుఈ సందర్భనలో హెచ్.ఎస్. జయగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు ప్రధానోపాధ్యాయులు, కొమరాడ వైద్యులు డాక్టర్ అరుణ్ కుమార్ నాయుడు, పర్యవేక్షకులు నిర్మల, ఏఎన్‌ఎం ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కూనవరం : ఈనెల 16, 17 తేదీల్లో రంపచోడవరంలో జరగనున్న సిపిఐ రెండవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కూనవరం డివిజన్ సమితి కరపత్రాలను పంచింది. ఈనెల 8 9 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన మహాసభలు వాయిదా పడిన విషయం తెలిసిందే కాగా అవే మహాసభలను 16, 17 తేదీల్లో జరపాలని రాష్ట్రపార్టీ నిర్ణయించింది. ఈ మేరకు నాలుగు మండలాల డివిజన్ పార్టీ విస్తృతంగా కరపత్రాలను పరిచింది. ఏజెన్సీలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టుపెట్టే కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు, జీవో నెంబర్ 3 ని పునరుద్ధరించేలా ఉద్యమించేందుకు, ఏజెన్సీ ప్రజల సమస్యలను పోరాటాల ద్వారా పరిష్కరించుకునేందుకు ఉద్యమ రూపకల్పన చేసేందుకు ప్రతి ఒక్కరు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా మహాసభల నిర్వహణ కోసం హార్దిక ఆర్థిక సహాయాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జ మోహన్ రావు, మండల కన్వీనర్ లంబు శ్రీనివాసరావు, జుత్తుక సూర్యచంద్రరావు, సూరం వెంకటేశ్వర్లు, బుడిపిటి వెంకటేశ్వర్లు, పునుగుపాటి శేఖర్, పూనెం కోటి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిధుల వివరాలు వెంటనే గ్రామసభలో తెలియజేయాలి

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల పరిధిలో గల సుజన కోట పంచాయితీలో గత నాలుగేళ్లుగా ప్రభుత్వం విడుదల చేసిన అభివృద్ధి నిధుల వివరాలు వెంటనే గ్రామసభలో తెలియ జేయాలంటూ వైస్ ప్రెసిడెంట్ బి. రుక్మిణితో పాటు పంచాయతీ వార్డు మెంబర్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి తెలిపారు మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ పంచాయితీ మండల కాంగ్రెస్ నాయకులు గత నెలలో సుజన కోట పంచాయితీ నిధులపై సమాచార హక్కు చట్టంపై నివేదిక అడగగా పంచాయతీలో సుమారుగా 47 లక్షలు పంచాయతీ నుండి విత్‌డ్రాలు అయినట్టు తెలిసిందన్నారు పంచాయతీ సెక్రెటరీ కూడా కొంతమంది వార్డు సభ్యుల సంతకాలు సేకరించడానికి వార్డు సభ్యుల దగ్గరకు వెళ్లడంతో సభ్యులు దేనికి అని నిలదీయడంతో పూర్తి సమాచారం ఇవ్వకుండావెళ్లినట్టు తెలిసింది కనుక దీనిపై అనుమానం రావడంతో వెంటనే వార్డు సభ్యులతో సమావేశమై తమ తీర్మానాలు లేకుండా ఏ విధంగా ఖర్చు పెట్టారు వెంటనే గ్రామ సభ ద్వారా ప్రజలకు తెలియపరచాలని వారు అధికారి వారికి అర్జీ పెట్టుకున్నారు దీనిపై వెంటనే స్పందించి తెలియపరచాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఎస్ నారాయణదొర ఎస్ రామకృష్ణ తటీ.రుక్మందర్ కె జయరాం కె ఈశ్వరి ఏం సుందరమ్మ పాల్గొన్నారు.